# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### వర్షాల సహాయక చర్యలపై ముందస్తు చర్యలు చేపట్టాలి

### అధికారుల టెలీ కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మిచౌంగ్ తుపాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. మంగళవారం ఉదయం అన్నిశాఖల జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు చేపట్టాలని, గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తు దృష్ట్యా సిబ్బందికి అన్నిరకాల సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సెలవులో వెళ్లిన సిబ్బంది తక్షణమే విధులకు హాజరుకావాలని, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా చేయాలన్నారు. పశువులను మేతకు వదలకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని, వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున అలాంటి ప్రాంతాల్లో రాకపోకల నియంత్రణకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువులను పరిశీలించి తెగే అవకాశం ఉన్నచోట చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇసుక బస్తాలను అందుబాటులో ఉంచాలని, గ్రామాలు, మున్సిపాలిటీల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వంగిన, విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలను పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం కూడా సెలవు ప్రకటించినట్లు చెప్పారు. సంక్షేమశాఖల వసతిగృహాల్లో ఉండే విద్యార్థులను హాస్టల్ విడిచి బయటకు వెళ్లకుండా నియంత్రణ పాటించాలన్నారు. అత్యవసర సేవల కోసం కాల్ సెంటర్లకు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. ధాన్యం వర్షాలకు తడవకుండా టార్పాలిన్లు సరఫరా చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా సమీపంలోని గోదాముల్లో భద్రపర్చాలన్నారు. ముంపు తగ్గే వరకు వరికోతలు కోయొద్దని రైతులకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీపీవో రమాకాంత్, సీఈవో విద్యాలత, డీఈవో వెంకటేశ్వరచారి, డీఎంహెచ్‌వో శిరీష, మహిళా శిశు సంక్షేమ అధికారి విజేత, ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వరరెడ్డి, అర్జున్, డీఆర్‌వో రవీంద్రనాథ్, ఆర్డీవోలు శిరీష, మంగీలాల్, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

### నేడూ పాఠశాలలకు సెలవు

ఖమ్మం ఎడ్యుకేషన్/ కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 5: మిచౌంగ్ తుఫాన్ దృష్ట్యా మరో రెండు రోజులపాటు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రెండో రోజు బుధవారం కూడా అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆల మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు హాస్టళ్లను విడిచి బయటకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### కంట్రోల్ రూమును పరిశీలించిన ఖమ్మం కలెక్టర్

రఘునాథపాలెం, డిసెంబర్ 5: తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమును ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ మంగళవారం పరిశీలించారు. జిల్లాలోని వర్ష ప్రభావ పరిస్థితుల గురించి పర్యవేక్షించారు.

#### క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

తుపాన్ దృష్ట్యా మరో రెండు రోజులు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. తుపాన్ ప్రభావం వల్ల చేపట్టాల్సిన చర్యలపై ఆయా శాఖల అధికారులతో ఐడీవోసీ మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా రైతుల సమస్యలపై ప్రధానంగా దృష్టిసారించి వారికి సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు.



## నియోజకవర్గ ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం..

### రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి



సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 5: సత్తుపల్లి నియోజకవర్గ ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. సత్తుపల్లిలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపును కాంక్షిస్తూ అహర్నిశలూ శ్రమించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎప్పటిలాగే తనవంతు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తానని, సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

### ఎన్నికల కోడ్ ముగిసినందున

## పరిపాలనలో వేగం పెంచాలి

### అధికారుల సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసినందున పరిపాలనలో వేగం పెంచాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్, డీఆర్‌వో, కలెక్టరేట్ విభాగాల పర్యవేక్షకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల విధులు ముగిసినందున పెండింగ్ ఫైళ్ల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఫైళ్ల జాప్యానికి అవకాశం లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ–ఆఫీస్‌ను తిరిగి ప్రారంభించాలని, దాని ద్వారా ఫైళ్ల ఉత్తర, ప్రత్యుత్తరాలు చేపట్టాలని సూచించారు. ఈ–ఆఫీస్ వల్ల కాగిత రహిత పరిపాలనతోపాటు ఫైళ్లు భద్రంగా ఉంటాయని, తద్వారా సమస్యల సత్వర పరిష్కారానికి దోహదం కలుగుతుందని వివరించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌వో రవీంద్రనాథ్, ఏవో గన్యా, అన్ని విభాగాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

## ప్రజలు మార్పును కోరుకున్నారు : సీతాలక్ష్మి

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 5: ప్రజలు మార్పును కోరుకున్నారని, వారి తీర్పును తాము శిరసా వహిస్తామని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్‌తో కలిసి ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఓటమితో కాస్త నిరాశ చెందామని, కానీ ప్రజల కోసం మళ్లీ రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని, కుంగిపోయే పరిస్థితి ఏమీ లేదని అన్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీకి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. కౌన్సిలర్లు రజాక్, యూసుఫ్, సుందర్‌రాజు, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, మాదా శ్రీరాములు పాల్గొన్నారు.

## 'ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నాం'

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రెడ్ అలర్ట్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు మరింత జాగ్రత్తగా ఉండాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అత్యవసర సేవల వినియోగం కోసం అన్ని జిల్లాలకూ ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నామని అన్నారు. వర్షాలు, వరదల సందర్భంలో పాటించాల్సిన ప్రొటోకాల్స్‌కు అనుగుణంగా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

రామవరం, ఆగస్టు 5: తుఫాన్ ప్రభావం బొగ్గు ఉత్పత్తిపై కూడా పడింది. మంగళవారం తెల్లవారు జామున నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్‌వోసీ, కిష్టారం ఓసీలో 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఓపెన్‌కాస్టు గనుల్లో భారీగా వరదనీరు చేరడంతో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడినట్లు చెప్పారు. నిలిచిన వర్షపు నీటిని బయటికి పంపించే పనులు చేపట్టామన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలకు అండగా నిలవాలి

### భారీ వర్షాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

### వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దు: ఎంపీ నామా



ఖమ్మం, డిసెంబర్ 5: తుపాన్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సూచించారు. బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలకు అండగా నిలవాలని, అవసరమైతే సహాయక చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఆయన మంగళవారం ఢిల్లీ నుంచి ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేసి తుపాన్ ప్రభావంపై ఆరా తీశారు. వరద ఉధృతంగా ప్రవహించే ప్రాంతానికి, వాగులు, చెరువుల వ్దదకు ప్రజలు వెళ్లొద్దని సూచించారు. రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరించినందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులను అప్రమత్తం చేయాలని ఉన్నతాధికారులకు నామా సూచించారు. ఖమ్మం మున్నేరు వరద ప్రవాహం గురించి కూడా ఆయన ఆరా తీశారు.

## తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 5: తుపాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నందున నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. నియోజకవర్గంలో వరదలు ఉధృతంగా ప్రవహించే ప్రాంతానికి ప్రజలు వెళ్లొద్దన్నారు. రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించినందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. వాగులు, రోడ్లు, వంతెనల పైనుంచి వెళ్తున్న వరద ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయొద్దని, సెల్ఫీల కోసం పొంగుతున్న వాగులు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లొద్దని సూచించారు. పత్తి, వరి రైతులు వర్షం నుంచి తమ పంటలను కాపాడుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మరో రెండు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయకచర్యలు చేపట్టాలని సూచించారు.













## స్తంభించిన జనజీవనం

### వీడని ముసురు.. జనం అతలాకుతలం
### పంటలకు తీవ్ర నష్టం.. రైతన్న ఆందోళన

ఖమ్మం ఉమ్మడిజిల్లాలో జనజీవనం స్తంభించింది. మిచౌంగ్ తుపాన్ ఎఫెక్ట్‌తో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జనం అతలాకుతలమయ్యారు. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యం కుప్పలపై టార్పాలిన్‌లు కప్పారు. అయినా ధాన్యపు రాశులు తడిసిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి కల్లాల్లో సైతం నీరు చేరింది. పత్తి చేలు తడిసి ముద్దయ్యాయి. ఖమ్మం నగరంలో వ్యాపారాలు స్తంభించాయి. కర్ఫ్యూ వాతావరణం నెలకొంది.

– నెట్‌వర్క్

## పంట నష్టంపై సమగ్ర సర్వే చేపట్టాలి : సీపీఐ

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 5: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించి సమస్యలను వివరించారు. వర్షాలకు పత్తి, వరి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయినందున వారిని ఆదుకోవాలని కోరారు.

#### ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు..

జిల్లాలో ఐదు నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్ సహా పలువురు ఉన్నతాధికారులకు సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయా అధికారులను వారి కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616